సాక్షి
నారాయణపేట

గురువారం ‌। 9 । మే । 2024

I



రాజకీయాల్లో ముందడుగు

జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో అలంపూర్ వాసులు ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

వివరాలు IIలో ▸



మద్యం, నగదు సీజ్

ఎన్నికల వేళ పోలీసుల తనిఖీల్లో భారీగా మద్యం, నగదు పట్టుబడుతోంది.

వివరాలు IIలో ▸



వాతావరణం

ఉదయం, మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఆలయాల్లో అమావాస్య పూజలు

నారాయణపేట రూరల్‌: జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో బుధవారం అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. రాష్ట్రాల సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రబాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తర నామావళి, అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేపట్టారు. అదేవిధంగా పట్టణంలోని అయ్యప్పస్వామి, సింగార్‌బేస్‌ శివలింగేశ్వరదేవాలయం, మహంకాళివీధి శివాలయం, సుభాష్‌రోడ్డు హనుమాన్‌ మందదిరం, జిలాల్‌పూర్‌ కర్రెప్ప స్వామి, బైరంకొండ శివాలయం, ఎక్లాస్‌పూర్‌ తిమ్మప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేపట్టారు.

మోదీ పాలనలో ధరల భారం



నారాయణపేట: మే 13న జరిగే పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్ర పక్షాలను ఓడించాలని దేశ రక్షణ, ప్రజాస్వామ్య సంరక్షణకు కాంగ్రెస్‌ ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌రామ్‌ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల మోదీ పరిపాలనలో నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని మైనార్టీలు, దళితులు, మహిళలపైన దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. నిరుద్యోగం తీవ్రస్థాయికి చేరుకుందన్నారు. రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన నరేంద్ర మోడీ పదేళ్ల తన పరిపాలనలో కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో పాటు బ్యాంకులలో లోన్లు తీసుకొని రూ.17 లక్షల కోట్లు ఎగ్గొట్టిన పారిశ్రామికవేత్తలకు అప్పులు మాఫీ చేశారన్నారు. దేశ జనాభాలో 32 శాతం ప్రజలు పౌష్టికాహార లోపంతో బాధపడుతుంటే.. మరోవైపు మోడీ మాత్రం ఈ దేశం వెలిగిపోతుందని ప్రపంచ గురువు భారతదేశం అంటూ ప్రగల్బాలు పలకడం విడ్డూరమన్నారు. దేశ సంపదను బడా కార్పొరేట్‌ శక్తులకు అప్పచెబుతూ మతోన్మాద విధానాలతో దేశ ప్రజలను విచ్ఛిన్నం చేస్తున్నారని విమర్శించారు. పాలమూరు పార్లమెంటు కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాశప్ప, నరహరి, పోషల్‌ కృష్ణ , వడ్డే సత్యప్ప, అంబాదాస్‌ పాల్గొన్నారు.

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి

దామరగిద్ద: జాబ్‌ కార్డు కల్గిన ప్రతి ఒక్కరు వందరోజుల ఉపాధి పొంది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సీఈఓ జ్యోతి అన్నారు. బుధవారం డీఆర్‌డీఓ రాజేశ్వరి సమక్షంలో మండలంలోని గడిమున్కన్‌పల్లిలో ఉపాధి కూలీ పనిచేస్తున్న పని ప్రదేశానికి వెళ్లి వారితో మాట్లాడారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేస్తే రోజు కూలీ గరిష్టంగా రూ.300 వరకు పొందవచ్చని వంద రోజుల్లో రూ.30 వేల కూలి డబ్బులు పొందవచ్చన్నారు. పని ప్రదేశాన్ని, కూలీల మస్టర్‌ను పరిశీలించి పూర్తి స్థాయి కూలీని పొందేలా కూలీలకు అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో నీడ ఏర్పాటుచేయాలన్నారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

సిబ్బందితో సమీక్ష

ప్రస్తుత 4098 మంది కూలీలతోపాటు కూలీల సంఖ్యను పెంచి పని కల్పించాలని, కొలతలపై అవగాహన కలిపించి గరిష్ట వేతనం పొందేలా పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. కూలీలను గ్రూప్‌గా డివైడ్‌ చేసి పని చేయించాలని, మస్టర్‌లను పేఆర్డర్‌లను సకాలంలో జనరేట్‌ చేసి కూలి డబ్బులు సకాలంలో అందేలా చూడాలన్నారు. ఎంపీడీఓ శ్రీదర్‌, ఎంపీఈఓ ఉదయ్‌శంకర్‌, ఏపీఓ జయమ్మ, టీఏలు, ఎఫ్‌ఏలు, పంచాయతీ కార్యదర్శిలు, మేటీలు పాల్గొన్నారు.

మేం చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది..

మహబూబ్‌నగర్‌ బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

- బీఆర్‌ఎస్‌ పాలనలోనే అందరికీ సంక్షేమ ఫలాలు
- గ్యారంటీల పేరిట మోసం చేసిన కాంగ్రెస్‌
- ఆ పార్టీపై ప్రజల్లో నమ్మకం పోయింది.. పశ్చాత్తాపపడుతున్నారు..



‘అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పదేళ్ల పాటు పాలన సాగించింది. మా హయాంలోనే అన్ని వర్గాలకు మేలు చేకూరింది.’ అని మహబూబ్‌నగర్‌ సిట్టింగ్‌ ఎంపీ, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను బురిడీ కొట్టించి అధికారంలోకి వచ్చిందని.. ఐదు నెలల్లోనే ఈ ప్రభుత్వం పట్ల ప్రజల్లో నమ్మకం లేకుండా పోయిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తూ కాలం గడుపుతోందని గ్రహించిన ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారన్నారు. ప్రస్తుతం లోక్‌సభ పోరులో బీఆర్‌ఎస్‌ వైపే ఉన్నారని.. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ హయాంలో జరిగిన అభివృద్ధే గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ‘సాక్షి’ ఇంటర్వ్యూలో మన్నె శ్రీనివాస్‌రెడ్డి చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే.. – సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్‌

వందలాది కోట్లతో అభివృద్ధి పనులు..

నేను ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేశా. మెటల్‌ రోడ్లను తారు రోడ్లగా మార్చేందుకు రూ.778 కోట్లు మంజూరు చేయించాను. దేవరకద్ర–కృష్ణా లైన్‌ పనులు మూడు దశాబ్దాలుగా నత్తనడకన సాగాయి. ఇది అందరికీ తెలిసిందే. ఈ మేరకు ప్రత్యేక దృష్టి సారించి పనుల్లో వేగం పెంచి పూర్తి చేశాం. దేవరకద్ర, మహబూబ్‌నగర్‌ ఓవర్‌ బ్రిడ్జిల నిర్మాణం పూర్తిచేయించాం. మహబూబ్‌నగర్‌–చించోళి జాతీయ రహదారి మంజూరుకు నావంతు కృషి చేశా. జాతీయ రహదారుల డివిజన్‌ కార్యాలయాన్ని పాలమూరుకు తీసుకొచ్చాం. ఐదేళ్లలో ఎంపీ ల్యాడ్స్‌ కింద రూ.25 కోట్లు వచ్చాయి. రెండేళ్లు కరోనా కాలం కాగా.. రూ.10 కోట్లు కోవిడ్‌ కట్టడికి కేంద్రమే వినియోగించింది. ఇవి పోనూ రూ.15 కోట్లతో లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోడ్లు, పాఠశాలల భవనాలతో పాటు సామాజిక కార్యక్రమాలకు వెచ్చించాం.

జడ్చర్ల–నంద్యాల కొత్త రైల్వే లైన్‌పై దృష్టి సారించా. జడ్చర్ల సమీపంలో ఎన్‌హెచ్‌ 44, 167 వెంట ఇండస్ట్రియల్‌ కారిడార్‌ కోసం కేంద్రానికి ప్రతిపాదించాం. ఇది పూర్తయితే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

ప్రత్యేక కార్యాచరణ

ఎన్‌హెచ్‌–44పై బ్లాక్‌స్పాట్‌ల వద్ద తరచుగా ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారు. ఈ మేరకు వంతెనల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించాం. పాలమూరు సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతా. పాలమూరు ప్రాజెక్ట్‌కు జాతీయ హోదానే లక్ష్యం. ప్రతి జిల్లాకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తా.

ప్రత్యర్థుల విమర్శలు అర్థరహితం..

పాలమూరు సమస్యలపై నేను లోక్‌సభలో నోరు విప్పలేదని ప్రత్యర్థులు విమర్శించడం అర్థరహితం. పార్లమెంట్‌ సమావేశాలకు 68 శాతం హాజరవడమే కాకుండా.. లోక్‌సభలో ఎక్కువ ప్రశ్నలు సంధించిన మూడో వ్యక్తిని నేనే. 356 ప్రశ్నలను లేవనెత్తా. స్వయంగా కేంద్ర మంత్రులను కలిసి పాలమూరు సమస్యలను పరిష్కరించాలని విన్నవించా. వికారాబాద్‌–కృష్ణా రైల్వే లైన్‌ గురించి పలుమార్లు లోక్‌సభలో ప్రస్తావించా. ప్రస్తుతం ఆ లైన్‌కు సర్వే జరుగుతోంది. కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్‌ వరకు డబ్లింగ్‌ పనులు పూర్తి చేయడంతో పాటు మహబూబ్‌నగర్‌, జడ్చర్ల, దేవరకద్ర, గద్వాల, శ్రీరాంనగర్‌, కృష్ణా రైల్వే స్టేషన్ల సుందరీకరణ, అభివృద్ధి, వైఫై సౌకర్యాల కల్పన వెనుక నా కృషి ఉంది. పత్తి రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని పాలమూరులో సీసీఐ రీజినల్‌ కార్యాలయం ఏర్పాటుపై పార్లమెంట్‌లో గళమెత్తి విజయం సాధించా. పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయించడంలో సఫలీకృతమయ్యా.

కాంగ్రెస్‌, బీజేపీవి కుయుక్తులు..

రూ.12.30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్‌, బీజేపీ కేవలం రాజకీయాలకే వాడుకుంటోంది. తెలంగాణ రాకముందు ఉమ్మడి ఏపీలో దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్‌ పాలమూరు రైతాంగం బాధలను పట్టించుకోలేదు. అదేవిధంగా పదేళ్లగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వలేదు. దీనిపై పార్లమెంట్‌లో ప్రస్తావించడంతోపాటు పలు పర్యాయాలు కేంద్ర మంత్రులను కలిసినా.. స్పందించలేదు. ఈ ప్రాజెక్ట్‌పై ఆ రెండు పార్టీలు కుయుక్తులతో విమర్శిస్తూ గెలవాలని చూస్తున్నారు. అంతేకాదు నారాయణపేటలో సైనిక్‌ స్కూల్‌, గోకుల్‌ ప్రాజెక్ట్‌ల ఏర్పాటుపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఏర్పాటు చేస్తామని చెబుతూ దాటవేసింది. అయినా ఏం చేయలేదంటూ కాంగ్రెస్‌, బీజేపీ నాపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసం ?. ఎవరెన్ని కుట్రలు చేసినా నేనే గెలుస్తా.

ఎన్నికల జిమ్మిక్కుగా రైతు భరోసా..

బీఆర్‌ఎస్‌ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశాం. రైతుబంధుతో పాటు రైతు బీమా, ఉచిత విద్యుత్‌ పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేశాం. కోతలు లేకుండా 24 గంటల పాటు నిరంతర విద్యుత్‌ అందించాం. మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల సంక్షేమంతోపాటు వారి అభ్యున్నతికి పాటుపడ్డాం. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూసింది. ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్పితే మిగతావి ఏమీ అమలు చేయలేదు. ఎన్నికల కోడ్‌ అమల్లో ఉందని తెలిసి.. ఎలాగూ ఈసీ ఒప్పుకోదని గ్రహించి రైతు భరోసా వేస్తున్నాం అని సీఎం రేవంత్‌ ఊదరగొట్టారు. కాంగ్రెస్‌ వ్యవహారాన్ని గ్రహించిన రైతులే ఎన్నికల జిమ్మిక్కు అని చెబుతున్నారు.

గ్యారంటీలు కాదు.. గారడీ మాత్రమే

- ఊసరవెల్లి రంగులు మార్చినట్టు పథకాల అమలుకు తేదీలు మారుస్తుండ్రు
- రిజర్వేషన్లు రద్దు చేస్తానన్న మోదీని ఓడించాలి
- బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మాజీ మంత్రి కేటీఆర్‌
- కల్వకుర్తి, గద్వాలలో రోడ్‌షో, అచ్చంపేటలో కార్నర్‌ మీటింగ్‌



అచ్చంపేట కార్నర్‌ మీటింగ్‌లో మాట్లాడుతున్న కేటీఆర్‌, చిత్రంలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌

కల్వకుర్తి/కల్వకుర్తి రూరల్‌/అచ్చంపేట/గద్వాల: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చింది గ్యారంటీలు కాదని.. గారడీలుగా మాత్రమేనని, ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మాజీ మంత్రి కేటీఆర్‌ ధ్వజమెత్తారు. నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం కల్వకుర్తి, అచ్చంపేట, గద్వాల పట్టణాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి, ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్‌ పార్టీకి పార్లమెంట్‌ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్‌ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌ పార్టీలో ఉండరని.. బీజేపీలోకి వెళ్తారని జోస్యం చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు దిక్కు లేకుండా పోయిందన్నారు. రైతుబంధు నిధులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో రెండు కోట్ల ఉద్యోగాలు రాలేదని, బీజేపీ మత విద్వేషం తప్ప.. అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. మతం పేరుతో విషం చిమ్ముతున్న బీజేపీకి పార్లమెంట్‌ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

బీజేపీకి ఓటు.. రిజర్వేషన్లకు చేటు

పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీకి వేసే ప్రతి ఓటు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు చేటు తెస్తుందని నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. కల్వకుర్తిలో కేటీఆర్‌ నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని చెబుతుందని.. రాజ్యాంగం రద్దయితే, అన్ని రిజర్వేషన్లు రద్దు అవుతాయని అన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలతో దళిత బహుజనుల జీవితాలు దుర్భరంగా మారుతాయన్నారు. దేశంలో దళిత మహిళలపై ఎన్నో అఘాయిత్యాలు చోటు చేసుకుంటున్నా పట్టించుకోని బీజేపీ.. అన్నామలై గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఎన్నికలు పదేళ్ల నిజాయితీ కేసీఆర్‌ పాలనకు.. ఆరు నెలల అబద్ధాల రేవంత్‌రెడ్డి పాలనకు జరుగుతున్న ఎన్నికలని అన్నారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్‌ ప్రభుత్వం పాలనలో వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. కాగా.. ప్రచారానికి వచ్చిన కేటీఆర్‌కు బీఆర్‌ఎస్‌ నాయకులు ఘనస్వాగతం పలికారు. రోడ్‌షోలో పూల వర్షం కురిపించారు. కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్‌ చైర్మన్లు గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల వెంకటేష్‌, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్‌, మున్సిపల్‌ చైర్మన్లు ఎడ్మ సత్యం, ఎడ్ల నర్సింహగౌడ్‌, విజితారెడ్డి, పార్లమెంట్‌ ఎన్నికల ఇన్‌చార్జి చాడ కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ ఏం తక్కువ చేసిందో చెప్పాలి..

నాగర్‌కర్నూల్‌ ఎంపీ రాములు పార్టీకి వెన్నుపోటు పొడిచి బీజేపీలో చేరారని.. బీఆర్‌ఎస్‌ ఏం తక్కువ చేసిందో ప్రజలకు చెప్పాలని కేటీఆర్‌ డిమాండ్‌ చేశారు. బీజేపీ మళ్లీ అధికాంలోకి వస్తే, రాజ్యాంగం రద్దు చేస్తోందని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రిజర్వేషన్లు కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. నిత్యావసర ధరలు పెంచడంతో పాటు రిజర్వేషన్లు రద్దు చేస్తానన్న మోదీని పార్లమెంట్‌ ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రవీణ్‌కుమార్‌ను ఎంపీగా గెలిపిస్తే, ఈప్రాంతానికి గౌరవం పెరుగుతుందని.. స్థానికుడైన ఆర్‌ఎస్‌పీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



గద్వాలలో కార్నర్‌ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

ఉత్త మాటలు, ఉద్దెర హామీలతో మోసం..

కాంగ్రెస్‌ పార్టీ నేతల ఉత్తమాటలు, ఉద్దెర హామీలతో ప్రజలు మోసపోయి గోసపడుతున్నారని కేటీఆర్‌ ధ్వజమెత్తారు. డిసెంబర్‌ 9న రూ.2 లక్షల రుణమాఫీపై తొలి సంతకమంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల్ని నమ్మించి మోసం చేశారన్నారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్టుగా పథకాల అమలు తేదీలను మార్చుకుంటూ పోతున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే జలదీక్ష చేసినా.. నీరు వదలని సన్నాసి ప్రభుత్వం కాంగ్రెస్‌ అని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్‌కు ఒక్కటే జిల్లా ఉండాలని చెబుతున్నారని.. అలాగైతే పోరాడి సాధించుకున్న గద్వాల జిల్లా రద్దు అవుతుందన్నారు. జిల్లా ఉండాలా? వద్దా? అని ప్రజలను కేటీఆర్‌ ప్రశ్నించగా.. అందరూ ముక్తకంఠంతో ఉండాలని నినదించారు. మతం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తుందన్నారు. పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ దేశానికి, తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు.

సీఎం సమక్షంలో భారీ చేరికలు



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రెనివట్ల ఎంపీటీసీ కన్నమ్మ, నాయకులు

మద్దూరు: సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌ నాయకులు కాంగ్రెస్‌ పార్టీలో బుధవారం చేరారు. రెనివట్ల ఎంపీటీసీ కన్నమ్మ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, నర్సిములు, ప్రభాకర్‌రెడ్డి వీరితో పాటు మరో 100 మంది కార్యకర్తలు హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో పార్టీలో చేరారు. అలాగే నియోజకవర్గంలోని కోస్గి లో కాంగ్రెస్‌ పార్టీ ఇంచార్జీ తిరుపతిరెడ్డి సమక్షంలో మద్దూరు, పల్లెర్ల, పర్సాపూర్‌, రెనివట్ల, తిమ్మారెడ్డిపల్లి, చెన్వార్‌ తదితర గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ నాయకులు మద్దూరు మైనార్టీ నాయకులు పార్టీలో చేరారు. వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని అత్యధిక మేజార్టీతో గెలిపించాలని వారు సూచించారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అందరు కలిసి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు నర్సింహా, పార్టీ నాయకులు తిరుపతిరెడ్డి, సంజీవ్‌, రమేష్‌రెడ్డి, చెన్నాప్ప, రహీం, చంద్రమోహన్‌, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నీటి కటకట

ధన్వాడ: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నీటి కటకట ఏర్పడిందని.. పార్లమెంట్‌ ఎన్నికలు పూర్తి అయితే తాగునీరు బంద్‌ చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ధన్వాడ మండలంలోని హన్మన్‌పల్లి, కిష్టాపూర్‌, ధన్వాడ గ్రామాంలో పార్లమెంట్‌ ఎన్నికల సందర్భంగా మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరుతు రోడ్‌ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చాల గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తిందని, ఎన్నికలు పూర్తి అయితే అవి కూడా రాకుండా పోయాతాయన్నారు. కోయిల్‌కొండ వద్ద ఉన్న మిషన్‌ భగీరథ తాగునీటి ఫిల్టర్‌కు ఆరు నెలల నుంచి నిధులు రాకపోవడంతో అది పనిచేయడంలేదన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో రైతులు ఇబ్బందులు పడొద్దు అని ఐకేపీల ద్వారా పొలాల వద్దకే వచ్చి వరి ధాన్యం కొనుగోళ్లు చేస్తే.. ఇప్పుడు ధన్వాడకు వెళ్లి విక్రయించాల్సి వస్తోందని, అది కూడా ఎప్పుడు కొనుగోళ్లు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.

మట్టి అక్రమ దందా..

ధన్వాడ ఆడ బిడ్డ అని ఎవరికి అయితే ఓటు వేశారో.. ఇప్పుడు ధన్వాడ పెద్ద చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తు డబ్బులను వేనుకేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికలు పూర్తి అయిన తరువాత రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండడు అక్కడ ఉత్తమ్‌రెడ్డి, లేదా వెంకట్‌రెడ్డి అయినా వస్తారని ఇంకో ఆరు నెలలు గడిస్తే మళ్లీ ఎన్నికలు వచ్చినా ఆశర్యపోవాల్సి అవసరం లేదని, ఎన్నికలు వస్తే బీఆర్‌ఎస్‌ తిరిగి అధికారంలోకి రావచ్చని అన్నారు. బీజేపీకి ఓటు వేస్తే ముందుగా వారు చేసేది రైతుల పొలాల వద్ద మీటర్లు బిగిస్తారని, ఉచిత విద్యుత్‌ నిలిపేస్తారని అన్నారు. ప్రజలు వీటిని గుర్తించి బీఆర్‌ఎస్‌ అభ్యర్థిని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, వాహిద్‌, మురళిధర్‌రెడ్డి, హన్మ్యనాయక్‌ తదితరులు పాల్గొన్నారు.



కిష్టాపూర్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కమలం గూటికి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌..?

- నలుగురు బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లు హస్తం గూటికి
- పేట మున్సిపాలిటీలో ఖాళీ అవుతున్న కారు

నారాయణపేట: మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గందె అనసూయ తన అనచరులతో బీఆర్‌ఎస్‌ పార్టీని వీడీ గురువారం డీకే అరుణ సమక్షంలో కమలం గూటికి చేరుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. 2017లో చైర్‌పర్సన్‌ బాధ్యతతో పార్టీని వీడి మళ్లీ 2023లో అదే బాధ్యతతో గందె అనసూయ సొంతగూడు అయిన బీజేపీలో చేరుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలాఉండగా, మరి కొన్ని రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు ఉండగా.. మున్సిపల్‌ పాలకవర్గంలో చైర్‌పర్సన్‌ భర్త, వైస్‌ చైర్మన్‌ మధ్య విబేధాలతో కౌన్సిలర్లు చేరో దారి పడుతుండడం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఇది వరకు మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ హరినారాయణభట్టడ్‌ కాంగ్రెస్‌ గూటికి చేరారు. ఆయనతో పాటు ఇద్దరు కౌన్సిలర్లు అమీరుద్దీన్‌, సరితలు సైతం కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు. మరో ఐదుగురు బీఆర్‌ఎస్‌ మహిళా కౌన్సిలర్లు సైతం పార్టీ మారారు. నలుగురు కాంగ్రెస్‌లోకి వెళ్లగా మరొకరు బీజేపీలోకి చేరిపోయారు. 2వ వార్డు జొన్నల అనిత, 12వ వార్డు కౌన్సిలర్‌ వరలక్ష్మి, 13వ వార్డు కౌన్సిలర్‌ బస్వపురం నారాయణమ్మ, 15వ వార్డు కౌన్సిలర్‌ బండి రాజేశ్వరితో పాటు వారి అనుచరులు ఏపీ జితేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలోకి చేరడంతో వారికి కండువ కప్పి ఆహ్వానించారు. మరో కౌన్సిలర్‌ మెహూశ్రీపాద్‌ పార్టీని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో కమలం గూటికి చేరడంతో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



జితేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరిన మహిళా కౌన్సిలర్లు

బీఆర్‌ఎస్‌కు షాక్‌..

నెల రోజుల వ్యవధిలోనే మున్సిపాటీలోని బీఆర్‌ఎస్‌ పాలకవర్గంలో మున్సిపల్‌వైస్‌ చైర్మన్‌తో పాటు ఏడుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌ పార్టీలో చేరడంతో బీఆర్‌ఎస్‌ పార్టీకి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి షాక్‌ తగిలినట్లయ్యింది. బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లు, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సైతం చేరో దారిలో వెళ్లిపోతుండడంతో పార్టీకి కోలుకోని దెబ్బ అని పలువురు చర్చించుకుంటున్నారు.

తాగునీటి కోసం 1.9 టీఎంసీలు విడుదల

- రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు నారాయణపూర్‌ డ్యాం నుంచి విడుదల
- గురువారం సాయంత్రానికి జూరాలకు చేరుకోనున్న నీరు



అడుగంటిన జూరాల ప్రాజెక్టు జలాశయం


గద్వాల రూరల్‌: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో నీరు పూర్తిగా అడుగంటిపోయింది. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో తాగునీటి సరఫరాకు అవసరమైన నీరు లేకుండా పోయింది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కర్ణాటక ప్రభుత్వం తాగునీటి అవసరాల కోసం నారాయణపూర్‌ డ్యాం నుంచి 1.9 టీఎంసీలను విడుదల చేసేందుకు అంగీకరించింది. ఈనేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి నారాయణపూర్‌ డ్యాం నుంచి 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువనున్న జూరాలకు విడుదల చేసినట్లు జూరాల ఈఈ జుబేర్‌ తెలిపారు. పదివేల క్యూసెక్కుల నీటిని రెండురోజుల పాటు నిరంతరాయంగా వదలనున్నట్లు తెలిపారు. నారాయణపూర్‌ డ్యాం నుంచి విడుదల చేసిన నీరు గురువారం సాయంత్రానికి జూరాలకు చేరుకోనుందని.. వదిలిన 1.9 టీఎంసీల నీటిలో జూరాల ప్రాజెక్టుకు ఒక టీఎంసీ నీరు వచ్చి చేరనున్నట్లు వివరించారు. మిగిలిన 0.9 టీఎంసీల నీరు ఆవిరి రూపంలో, నదిలో గుంతలు నిండటానికి వృధాగా పోతుందన్నారు. గతంలో 2019లో కూడా ఇదే తరహాలో సమస్య తలెత్తినప్పుడు అప్పట్లో నారాయణపూర్‌ డ్యాం నుంచి రెండు టీఎంసీల నీటిని విడుదల చేయగా.. జూరాలకు కేవలం ఒక టీఎంసీ నీరు మాత్రమే వచ్చి చేరింది.

రాజకీయాల్లో ముందడుగు..

- వలస రాజకీయాల్లో సత్తా చాటిన అలంపూర్ వాసులు
- జాతీయ, రాష్ట్రీయ రాజకీయాల్లోనూ కీలకంగానే

అలంపూర్: జీవనోపాధి, విద్య, ఉద్యోగ, వ్యాపారాలకు వలస వెళ్లడం సహజమే. రాజకీయల్లోనూ వలసలు మనం నిరంతరం చూస్తూనే ఉంటాం. అలాంటి వలస రాజకీయాల్లో రాణించడం అరుదు. అలాంటి రాజకీయాల్లో అలంపూర్ వాసులు తమ సత్తా చాటారని చెప్పొచ్చు. ఈ ప్రాంతానికి వలస వచ్చిన వారిని సైతం అక్కును చేరుకుని వారికి రాజకీయ అగ్రతాంబులం అందించారు. అందుకే అలంపూర్ గడ్డ రాజకీయాలకు అడ్డాగా చెబుతుంటారు. కేవలం పోటీలోనే కాదు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించి ఈ ప్రాంతానికి గుర్తింపును తీసుకొచ్చారు. జాతీయ పార్టీల్లో రాణించిన ప్రముఖంగా నిలిచిన వారితోపాటు ఈ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలివెళ్లి శాసన సభ, పార్లమెంట్‌లలో అధ్యక్షా అని పిలిచిన వారి గురించి మనం ఒక సారి పరిశీలిద్దాం.

వనపర్తి తొలి ఎమ్మెల్యేగా..



అలంపూర్ ప్రాంతానికి చెందిన సురవరం ప్రతాప్‌రెడ్డి వనపర్తి తొలి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడుకు చెందిన సురవరం ప్రతాప్‌రెడ్డి పత్రిక సంపదాకులు, కవి, స్వాతంత్ర్య సమరయోధులు. అలంపూర్ అసెంబ్లీ స్థానం రిజర్వ్ ఉండటంతో ఆయన వనపర్తి నియోజకవర్గంలో 1952లో పోటీ చేశారు.

వలస వెళ్లి ఐదు సార్లు ఎమ్మెల్యేగా..



ఒక వ్యక్తి ఒక చోటి నుంచి మరో చోటికి వెళ్లి రాజకీయాల్లో రాణించడం సాధారణమే. కానీ ఒక్కోసారి ఒక ప్రాంతంలో నిలిచిన ఏకంగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా చేసిన ఘనత డాక్టర్ నాగన్నకు దక్కుతుంది. 1952లో అలంపూర్ ఎస్సీ నియోజకవర్గం. అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన డాక్టర్ నాగన్న కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజేతగా నిలిచారు. 1953లో రెండోసారి ఇదే అలంపూర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో అలంపూర్ జనరల్‌కు కేటాయించారు. దీంతో ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన నాగన్న 1957లో కల్వకుర్తిలో, 1962 అచ్చంపేటలో, 1967 షాదనగర్ నియోజకవర్గాల్లో పోటీ చేసి విజయం సాధించారు. 1952లో రాజకీయాలను ఆరంభించిన డాక్టర్ నాగన్న ఐదు సార్లు ఎన్నికల బరిలో నిలిచి దాదాపు 20 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. ఇలా వలసవాదులకు ఏ విధంగా ఈ ప్రాంతం రాజకీయ జీవితం ప్రసాదించిందో ఇక్కడి నుంచి వెళ్లిన వారు సైతం వలస వెళ్లి రాజకీయాల్లో రాణించారు.

తొలి ప్రయత్నంలోనే సీఎం అభ్యర్థిగా..



రాజకీయాల్లో అవకాశాలు రావడం అరుదుగా ఉంటుంది. కానీ ఒక పార్టీకి అధినేతగా ఉంటూ తొలిసారి అసెంబ్లీ బరిలో నిలిచిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్థానికంగా కాకుండా ఇతర ప్రాంతాల నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అలంపూర్ పట్టణానికి చెందిన డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తొలిసారిగా సిర్పూర్ నుంచి అసెంబ్లీ బరిలో నిలిచారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన ఎస్పీగా తన జీవితాన్ని ఆరంభించారు. పోలీస్ శాఖలో అంచెలంచెలుగా ఎదిగిన ఆయన అడిషనల్ డీజీపీ స్థాయికి చేరుకున్నారు. ఆ తర్వాత గురుకుల పాఠశాలల కార్యదర్శిగా అందరికి సుపరిచితం అయ్యారు. స్వేరోస్ సంస్థ ద్వార సేవా కార్యక్రమాలు నిర్వహించిన బీఎస్పీలో చేరారు. అనతికాలంలోనే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించబడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ నుంచి ఆయన సీఎం అభ్యర్థిగా ఉన్నారు. దానికి తోడు ఆయన స్థానికంగా కాకుండా కోమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కానీ అక్కడ ఓటమి తప్పలేదు. దీంతో మారిన రాజకీయ సమీకరణాలతో ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

తొలుత నాన్‌లోకల్ తర్వాత లోకల్



నాగర్‌కర్నూల్ రిజర్వుడు పార్లమెంట్ స్థానం నుంచి అలంపూర్ నియోజకవర్గం ఇటిక్యాల మండలం కొండేరుకు చెందిన మందా జగన్నాథం నాలుగు సార్లు ఎంపీగా సేవలందించారు. తొలుత నాన్‌లోకల్‌గా ఉన్న మందా జగన్నాథం ఆ తర్వాత 2009లో జరిగిన అసెంబ్లీ స్థానాల పునర్విభజనలో అలంపూర్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోకి వెళ్లడంతో నాన్‌లోకల్‌గా ఉన్న మందా జగన్నాథం లోకల్ అభ్యర్థిగా అయ్యారు. మందా జగన్నాథం 1996, 1999, 2004లో నాన్‌లోకల్‌గా అభ్యర్థిగా ముద్ర ఉండింది. పునర్విభజన తర్వాత 2009లో ఆయన స్థానికుడిగా ఎంపీ అయ్యారు.

జాతీయ రాజకీయాల్లో కీలకం..



ఈ ప్రాంత వాసులు చట్టసభలకే కాక ఉన్న పార్టీలోనే జాతీయ స్థాయి పదవిని దక్కించుకున్నారు. ఉండవెల్లి మండలం కంచుపాడు చెందిన సురవరం సుధాకర్‌రెడ్డి సీపీఐ పార్టీలో జాతీయ కార్యదర్శిగా ఎదిగారు. నల్లగొండ ఎంపీగా పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. పోరాట పటిమగల కుటుంబంలో జన్మించిన సుధాకర్‌రెడ్డి విద్యార్థి దశ నుంచే పలు ఉద్యమాలతో రాజకీయాల్లో రాణించారు. ఉస్మానియా కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలోనే విద్యార్థి సమస్యలపై పోరాడుతూ స్టూడెంట్ యూనియన్ నాయకుడిగా ఎదిగారు. విద్యాభ్యాసం కొనసాగుతున్న సమయంలో విద్యార్థి కమ్యూనిస్టు విభాగంలో పని చేస్తున్న సుబ్బన్న, రాజన్న ప్రోద్బలంతో ముందుకు సాగారు. అనంతరం నీలం రాజశేఖర్‌రెడ్డి సహాయసహకారాలతో రాజకీయాల్లో రాణించారు. అంచెలంచెలుగా రాష్ట్ర, కేంద్ర రాజకీయాల్లో ముఖ్య వ్యక్తిగా ఎదిగారు. సీపీఐ పార్టీ జాతీయ పదవిని దక్కించుకుని తెలుగు రాష్ట్రాలకు సొంత గ్రామానికి వన్నె తెచ్చారు. స్థానికంగా ఉన్న బంధువర్గం కమ్యూనిస్టు భావాలను వ్యతిరేకించడంతో అలంపూర్‌లో పోటీ చేయడానికి ఇష్టపడలేదు. కొల్లాపురంలోని ఆయన తల్లి తరపు బంధువులు కమ్యూనిస్టు భావాలను స్వాగతించడంతో 1985, 1990లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయన రెండు ఎన్నికల్లోనూ స్వల్ప మెజార్టీతో ఓటమిపాలయ్యారు. కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గం నుంచి 1994లో పోటీ చేసినా విజయం వరించలేదు. రాష్ట్ర, కేంద్ర రాజకీయాల్లో రాణిస్తూ రాజధానికి మకాం మార్చిన ఆయన నల్లగొండ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి 1998, 2004లో విజయం సాధించారు. అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం దక్కకపోయిన పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.

అలంపూర్‌కు దక్కిన మంత్రి పదవి

వలస రాజకీయాలతో ప్రత్యేకత చాటుకున్న చల్లా రాంభూపాల్‌రెడ్డి స్థానికంగా పోటీ చేసి మంత్రి పదవిని దక్కించుకున్నారు. ఈ నియోజకవర్గం నుంచి ప్రభుత్వ కేబినెట్‌లో పని చేసిన ఏకైక వ్యక్తిగా గుర్తింపు పొందారు. 45 ఏళ్ల నుంచి మళ్లీ ఆ అవకాశం ఎవరికి దక్కకపోవడం విచారకరం. ఉండవెల్లి మండలం పుల్లూరు చెందిన చల్లా రాంభూపాల్‌రెడ్డి రాజకీయ జీవితం స్థానికేతర నియోజకవర్గాల నుంచే ఆరంభించారు. 1962లో రాజకీయాల్లో అడుగు పెట్టిన ఆయన 1964లో కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గ నుంచి అసెంబ్లీకి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. అనంతరం 1967లో కర్నూలు జిల్లాలోని నందికోట్కూరు నియోజకవర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. 1978లో సొంత నియోజకవర్గమైన అలంపూర్ నుంచి పోటీచేసి గెలిచిన ఆయనకు కేబినెట్ హోదా దక్కింది. మంత్రిగా కొనసాగారు.

స్థానికేతరులకు పట్టం కట్టిన అలంపూర్ వాసులు

అలంపూర్ నియోజకవర్గంలోనూ స్థానికులతోపాటు స్థానికేతరులు అసెంబ్లీ బరిలో నిలిచి తమ రాజకీయ భవిష్యత్‌కు పునాదులు వేసుకున్నారు. 1952లో అసెంబ్లీగా అవిర్భవిస్తే ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే ఈ ప్రాంతానికి కర్నూల్, ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు సైతం ఆయా ప్రధాన పార్టీల నుంచి టికెట్ దక్కించుకుని విజయం సాధించారు. 2004 వరకు వలసవాదులకు అవకాశం కల్పించిన ఇక్కడి ప్రజలు ఆ తర్వాత స్థానికులనే ఆదరిస్తున్నారు. స్థానిక నినాదం బలపడటంతో ఇక్కడ స్థానికేతరులు రావడానికి వెనకడుగు వేస్తున్నారు.

అవినీతి రహిత పాలన మోదీతోనే సాధ్యం

- ఉగ్రవాదం, నక్సలిజం నిర్మూలన ఘనత బీజేపీదే
- 10న పేటకు ప్రధాని రాక
- బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు



మాట్లాడుతున్న మురళీధర్ రావు

నారాయణపేట: ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో అవినీతి రహిత, అభివృద్ధి, సుస్థిర పాలన సాగిందని బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. బుధవారం పట్టణానికి వచ్చిన ఆయన 10న నిర్వహించే ప్రధాని నరేంద్ర మోదీ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అవినీతి, ప్రజల మధ్య విభజన విద్వేషాలు, కుటుంబ పాలన సాగిందని విమర్శించారు. కుటుంబ పాలన సాగించి అవినీతికి పాల్పడి దేశాన్ని అధోగతి పాలు చేసిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. పదేళ్ల పాటు రిజర్వేషన్లు పుష్కలంగా ఉన్నాయని రాబోయే రోజుల్లో అదేవిధంగా ఉంటాయన్నారు. ఈశాన్య రాష్ట్రాలో ఒకప్పుడు ఉగ్రవాదం ఉండేదని, ప్రస్తుతం ఉగ్రవాద రహిత భారతదేశం ముందుకు సాగుతుందన్నారు. ప్రధాని దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్ది నేడు ప్రపంచంలో 5వ స్థానంలో నిలబెట్టారని తెలిపారు. పదేళ్లుగా దేశంలోనే కాదు ప్రపంచంలోనూ అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. సొంత మెజార్టీతో రెండు పర్యాయాలు మోదీ ప్రధానమంత్రి అయ్యారన్నారు. మూడోసారి ప్రధానమంత్రి చేయడమే లక్ష్యమన్నారు. ఇండియా కూటమి అవినీతి పార్టీలకు సారథ్యం వహిస్తుంటే, ఎన్డీఏ కూటమి దేశ హితం, అభివృద్ధి కోసం సారథ్యం వహిస్తున్నన్నారు. చరిత్రాత్మమైన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఈవీఎన్ రెడ్డి, నాగురావు నామాజీ, రతంగ్ పాండురెడ్డి, బంగారు శృతి, పవన్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి సాధ్యం కానీ హామీలు..

- బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి



మునిమోక్షంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి మన్నెశ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: కాంగ్రెస్ అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నెశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మండలంలోని వేపూర్, మునిమోక్షం, తదితర గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో బీజేపీ, కాంగ్రెస్‌లపై విమర్శలు గుప్పించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయమని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కరెంట్ కోతలు, తాగునీటి సమస్య అధికమైందని, సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజల పక్షాన పోరాడి సమస్యలు పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాల్‌రాజు, రమణారెడ్డి, చెన్నయ్య, నరేందర్, బాలయ్య, కృష్ణయ్యగౌడ్, నాగయ్య, బసిరెడ్డి పాల్గొన్నారు.

నేను మీ మన్నెని.. మీలో ఒకడిని...

నవాబుపేట: 'నేను మీ మన్నెని.. ఓట్ల కోసం వచ్చిన వ్యక్తిని కాను.. మీలో ఒకడిని.. మీతో నిరంతరం ఉండే వ్యక్తిని.. ఎంపీగా మరోసారి అవకాశమిస్తే సేవ చేసుకునే భాగ్యం కలుగుతుంది.' అంటూ మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి నవాబ్‌పేటలో ప్రసంగించారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ రోడ్‌షోలో ఆయనతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల మధ్యఉండే నాయకుడినని.. రెండోసారి ఎంపీగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలు అసెంబ్లీ ఎన్నికల్లో పట్టం కట్టిన ప్రజలు చాలా తప్పు చేశామని బాధపడుతున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తప్పు సరిద్దిదుకోవాలని కోరారు. బీజేపీ సైతం పదేళ్లు మాటలతో పబ్బం గడిపిందని ఆరోపించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, ప్రతాప్, సంతోష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, కృష్ణగౌడ్, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, అంజయ్య, నర్సింహులు, శ్రీశైలం పాల్గొన్నారు.

హన్వాడను దత్తత తీసుకుంటా..

- ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి చల్లావంశీచంద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

హన్వాడ: హన్వాడపై బలంగా నమ్మకముంది. ఈ మండలం నుంచి అత్యధికంగా 8వేల మెజార్టీకి తగ్గకుండా వస్తాయి. ఎంపీగా గెలిచి న వెంటనే మండలాన్ని దత్తత తీసుకుని, ప్రతి ఇంటికీ ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పిస్తా అంటూ మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి చెప్పారు. బుధవారం మండల కేంద్రంలో బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రతి పల్లె నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి మాట్లాడారు. కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ సామాన్యుల నడ్డివిరిచి నిత్యావసర ధరలను రెండింతలు చేసిందన్నారు. రూ.400 ఉన్న సిలిండర్ ధర నేడు రూ.1200 చేశారన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు సామాన్యులకు అందనంత దూరం చేశారని మండి పడ్డారు.

అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయండి

పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి గౌరవాన్ని నిలుపుతూ ప్రతి ఒక్కరు పార్టీలకతీతంగా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గతంలో కేసీఆర్‌కు రాజకీయ బిక్షపెట్టిన మన పాలమూరు ప్రజలను తెలంగాణ ఏర్పడ్డాక ఇక్కడి ప్రజలను, ప్రాంతాన్ని తుంగలో తొక్కిన కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఎర్ర సత్యం చౌరస్తాలో చల్లావంశీచంద్‌రెడ్డితో కలిసి కార్నర్‌మీటింగ్‌లోనూ మాట్లాడారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, ఎస్పీ వెంకటేష్, మిథున్‌కుమార్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రి, ఎండీ తఖీ, రాజునాయక్, కృష్ణయ్యయాదవ్, మహేందర్, సుధాకర్‌రెడ్డి, యాదవరెడ్డి, కృష్ణయ్య, సుధాకర్, రాములు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

వేలికి సిరా.. తప్పిదాలకు తెర



పాలమూరు: ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో దొంగ ఓట్లను నిరోధించేందుకు ఎన్నికల సంఘం సిరాను వినియోగిస్తుంది. పోలింగ్ బూత్‌లో ఓటు వేయగానే ఓటర్ల ఎడమ చేతి చూపుడు వేలిపై సిరా రాస్తారు. చర్మంపై పూసి ఈ సిరాను త్వరగా తొలగించడానికి సాధ్యపడదు. వేలుపై పూసిన సిరా కాంతికి గురై 15–30సెకన్లలో పొడి బారుతుంది. చర్మాన్ని శుభ్రం చేసినప్పుడు కొద్దికొద్దిగా చెదిరిపోతుంది. కొంత కాలం వరకు వేలికి సిరా ఉంటుంది. ఎన్నికలకు వినియోగించే సిరా 10శాతం, 14–18 శాతం సిల్వర్ నైట్రేట్ ద్రావణం మిళితమై ఉంటుంది. సిరాలోని సిల్వర్ నైట్రేట్‌తో సూర్యరశ్మి తగలగానే చర్మంపై స్పష్టమైన గుర్తు ఏర్పడుతుంది. కర్ణాటక ప్రభుత్వ రంగంలోని మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్, హైదరాబాద్‌లోని ఓ ల్యాబ్‌లో ఈ సిరాను తయారు చేస్తున్నారు. భారత ఎన్నికల సంఘం వద్ద ఈ సిరా ఉత్పత్తికి 1962లోనే ఆయా సంస్థలు హక్కులు పొందాయి. 1976నుంచి మరో 28 దేశాలకు ఈ సంస్థ సిరాను సరఫరా చేస్తోంది. ఒకరు ఓటు వేసిన తర్వాత తిరిగి పోలింగ్ బూత్‌కు వచ్చే పరిస్థితి ఏర్పడదు.

స్థానిక నాయకుల తీరుపై మంత్రిని నిలదీత

- సమీక్షించి, హామీలు అమలు చేస్తానని హామీ



వార్డు ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: పట్టణంలో స్థానిక నాయకుల తీరు ఏమీ బాగో లేదని కాలనీవాసులు మంత్రి జూపల్లికృష్ణారావు నిలదీశారు. దీనిపై ఆయన సమీక్షిస్తామని హామీ ఇచ్చారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. 11వ వార్డు ఇందిరా కాలనీ మహిళలు హామీల అమలుతీరుతో పాటు, స్థానిక నాయకుల వ్యవహార శైలిపై మంత్రిని ప్రశ్నించారు. నాయకుల పనితీరును సమీక్షిస్తానని, ఇచ్చిన హామీలన్నీ వరుసక్రమంలో అమల్లోకి వస్తాయని వివరించారు. ఎన్నికల్లో మల్లురవికి ఓటేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ద్వారానే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండో స్థానం కోసం పోటీపడుతున్నాయన్నారు. జగదీశ్వరుడు, రహీంపాషా, బొరెల్లి మహేష్, బిజ్జ రమేష్, గౌస్ తదితరులున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



భరత్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న పూరి సురేష్

వనపర్తిటౌన్: తనను గెలిపిస్తే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయనతో పాటు వాసవి సేవాసమితి జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ ప్రసాద్ మాట్లాడుతూ.. 50 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ చేయని అభివృద్ధిని కేవలం రెండుసార్లు గెలిచి ప్రధాని మోదీ చేసి చూపించారన్నారు. బీజేపీతోనే ప్రగతి సాధ్యమని ప్రజలు గుర్తించి ఓటేయాలని కోరారు. అనంతరం పూరి సురేష్ మాట్లాడుతూ.. గతంలో అధికారంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యుల సంక్షేమాన్ని విస్మరించాయని, మోదీ పాలనలోనే సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్యవైశ్యుల మద్దతు బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కే ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆకుతోట దేవరాజు, లక్ష్మీనారాయణ, గోనూరు యాదగిరి, బచ్చు వెంకటేష్, బాసెట్టి శ్రీనివాసులు, బచ్చు రాము, కొండా కిషోర్, మారం గోవిందు, నవీన్, సుమన్, భాగ్యలక్ష్మి, వసంత, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుంటే ఉరేసుకుంటా..



ఆవంచలో మాట్లాడుతున్న డా.మల్లురవి

బిజినేపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేకపోతే ఇక్కడే చెట్టుకు ఉరేసుకుంటానని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డా.మల్లురవి అన్నారు. బుధవారం తిమ్మాజిపేట మండలంలోని ఆవంచలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికలలో తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నారని వివరించారు. తెల్లరేషన్ కార్డుదారులున్న వారిలో ఇళ్లు లేని వారికి నిర్మిస్తామన్నారు. కేంద్రంలో కూడా రాహుల్ గాంధీ ప్రధాని అయితే మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ బహదూర్, వెంకట్రాంరెడ్డి, బాలరాజ్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు బోల్తా: ఇద్దరికి గాయాలు



అడ్డాకుల: జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సులో 17 మంది ప్రయాణికులతో మంగవారం రాత్రి 9 గంటలకు డ్రైవర్ రత్నం బెంగళూర్‌లో హైదరాబాద్‌కు బయలు దేరాడు. మార్గమధ్యలో బుధవారం తెల్లవారుజామున 44వ నంబర్ జాతీయ రహదారిపై అడ్డాకుల సమీపంలోని స్నేహ చికెన్ ఎగుమతుల పరిశ్రమ ఎదుట ముందు వెళ్తున్న లారీని దాటే క్రమంలో బస్సు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి గుంతలో బోల్తాపడింది. బస్సులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన వంశీకృష్ణారెడ్డి, బెంగళూర్‌కు చెందిన ప్రజ్ఞాతో పాటు మరి కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేయించుకున్న క్షతగాత్రులు తర్వాత వారి స్వస్థలాలకు వెళ్లిపోయారు. బోల్తాపడిన బస్సును అక్కడి నుంచి తీసుకెళ్లారు. మిగతా ప్రయాణికులు అదే ట్రావెల్స్‌కు చెందిన మరో బస్సులో హైదరాబాద్‌కు పంపించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 6న ఇదే స్థలంలో రెండు డీసీఎంలు ఎదురెదురుగా ఢీకొని డ్రైవర్, క్లీనర్ మృతి చెందిన ఘటన మరువక ముందే ట్రావెల్స్ బస్సు బోల్తాపడటం గమనార్హం.

మద్యం, నగదు సీజ్



ఖిల్లాఘనపురంలో పట్టుకున్న మద్యంతో పోలీసులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.30 వేల విలువ చేసే 98.85 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీహరి బుధవారం తెలిపారు. తనిఖీల్లో భాగంగా గ్రామాల్లో తిరుగుతున్న తమకు మండలం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తిర్మలాయపల్లి, వెంకటాంపల్లి పరిసర ప్రాంతాల్లో తనిఖీ చేస్తున్న సమయంలో కరివెనకు చెందిన విజయ్‌కుమార్ మద్యం తరలిస్తుండటంతో పట్టుకున్నట్లు తెలిపారు.



బాలానగర్ చెక్‌పోస్టులో పట్టుబడిన నగదు

బాలానగర్: బాలానగర్ పోలీస్ చెక్‌పోస్టులో బుధవారం రూ.50,010 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్‌కు వాహనంలో వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో నగదు పట్టుబడినట్లు ఎస్ఐ తిరుపాజీ తెలిపారు.

నకిలీ పైపులు పట్టివేత

- రూ. 10లక్షల విలువ ఉన్న సామగ్రి గుర్తింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కంపెని అధికారులు



కంపెనీ పేరుతో ఉన్న నకిలీ డ్రిప్ పైపులను చూయిస్తున్న కంపెనీ లీగల్ అధికారి

గద్వాల క్రైం: రైతులను చవకగా మోసం చేయొచ్చనే భావనలో నాసిరకం వ్యవసాయేతర పరికరాలను గుట్టుగా విక్రయాలు చేస్తున్నారు. విషయం గుర్తించిన కంపెనీ అధికారులు పోలీసుల సాయంతో సామగ్రిని బుధవారం జిల్లా కేంద్రంలో పట్టుకున్నారు. టెక్స్‌మో కంపెనీ లీగల్ అధికారులు ఆఫ్తాబ్ సలీం, నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ ఇంజినీరింగ్ దుకాణ యాజమాని విజయ్ కుమార్‌రెడ్డి టెక్స్‌మో కంపెనీకి సంబంధించిన పీవీసీ, యూ పీవీసీ, డ్రిప్ సామగ్రి తదితర పైపులను నాసిరకంగా టెక్స్‌మో గోల్డ్ పేరుతో విక్రయాలు చేస్తున్నారు. కొన్ని రోజులుగా జిల్లాలోని వివిధ గ్రామాల రైతులకు కంపెనీ నిర్ణయించిన ధరల కంటే తక్కువ ధరకు అమ్ముతున్నారు. అసలు కంపెనీ పైపులకు ఏ మాత్రం తీసిపోలేనిదిగా ఉండడం, ఆ కంపెనీ సిబ్బంది గుర్తించి నాసిరకం సామగ్రిని కొనుగోలు చేసిన రైతులను ఆరాతీశారు. వ్యాపారి విజయ్‌కుమార్‌రెడ్డి గోదాంను బుధవారం ఉదయం రూరల్ పోలీసుల సాయంతో సోదాలు చేశారు. గోదాంలో రూ. 10లక్షల విలుగల వ్యవసాయేతర డ్రిప్ పైపులు, ఇతరరాత్ర పైపులను గుర్తించారు. టెక్స్‌మో కంపెనీ పేరుతో నాసిరకం పైపులను రైతులకు విక్రయాలు చేయడంతో పాటు వారిని మోసం చేస్తున్నట్లు తెలిపారు. లక్ష్మీనారాయణ ఇంజినీరింగ్ కో లిమిటెడ్ నిర్వాహకుడిపై చీటింగ్ కేసు కేసు నమోదు చేయాల్సిందిగా రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ పర్వతాలను వివరణ కోరగా.. నాసిరకం పైపులను అసలు కంపెనీ పేరుతో విక్రయాలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎవరైనా నాసిరకం వ్యవసాయేతర పరికరాలు విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

అవగాహనే ప్రథమ చికిత్స

సేవ

ఈ ఫొటోను చూడండి.
ఇందులో ఉన్నది షుగర్ పేషెంట్లు.
ఒకరితో ఒకరు షుగర్ వ్యాధి గురించి మాట్లాడుకుంటూ అవగాహన కల్పించుకుంటున్నారు.
'చికిత్స కంటే అవగాహన ముఖ్యం' అంటారు ప్రియా దేశాయ్.
బెంగళూరులో ఆమె పేదవారి కోసం ఉచిత క్లినిక్‌లు నడుపుతున్నారు.
డయాబెటిస్, బి.పి ఉన్న వారికి సదస్సులు నిర్వహిస్తూ ఉచిత మందులు అందేలా చూస్తున్నారు.
ప్రతి ఉదయం ఈ క్లినిక్‌ల ముందు క్యూ కట్టే పేషెంట్లను చూస్తే ప్రియా సేవ తెలుస్తుంది.





ప్రియా దేశాయ్

బెంగళూరులోని శాంతి నగర్‌లో ఉన్న 'అనాహత్' క్లినిక్‌కు వెళితే ఒక బోర్డు మీద ఐదారు రకాల భోజనం ప్లేట్ల ఫొటోలు ఉంటాయి. వాటిలో రొట్టె, కూర, అన్నం, ఇతర కూరలు ఉంటాయి. ప్రతి ప్లేట్ కింద స్టార్లు ఇచ్చి ఉంటారు. ఐదు స్టార్లు ఇచ్చిన భోజనం ప్లేట్‌ను ఆహారంగా తీసుకోవాలని బీపీ, షుగర్ ఉన్న పేషెంట్లకు సులభంగా అర్థమయ్యేలా చెప్తారు. మీ ప్లేట్‌లో ఏముంది అనేదే మీ ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందని ఈ క్లినిక్‌లో వారానికి రెండుసార్లు జరిగే అవగాహన సదస్సుల్లో తెలియచేస్తారు. ఇలాంటి అవగాహన దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీల తీవ్రతను తగ్గిస్తాయని అంటారు ప్రియా దేశాయ్. ఆమె ఈ క్లినిక్ నిర్వాహకురాలు.

10 వేల మందికి ఒక క్లినిక్

బెంగళూరు జనాభా కోటీ ముప్పై లక్షలకి పైనే. కాని ఇక్కడ మొత్తం 147 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రే ఉన్నాయి. అంటే దాదాపు 80 వేల మందికి ఒక క్లినిక్. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా 30 వేల మందికి ఒక క్లినిక్ ఉండాలి. ఆదర్శవంతమైన పాలనా నిర్వహణ అంటే 10 వేల మందికి ఒక క్లినిక్. ఇలాంటి స్థితిలో పేదలకు ఎలా మంచి వైద్యం అందుతుంది అని అడుగుతారు ప్రియా



దేశాయ్. జర్నలిజం అభ్యసించిన ప్రియ తన తల్లి రాణీదేశాయ్ స్ఫూర్తితో వైద్య సేవారంగంలోకి వచ్చారు. అనేక స్వచ్ఛంద సంస్థల్లో పని చేసిన రాణీ దేశాయ్ తన కుమార్తెతో కలిసి 'అనాహత్ క్లినిక్'కు అంకురార్పణ చేశారు. బెంగళూరులో ఉన్న పేదలకు వైద్యం అందించాలనేది అనాహత్ సంకల్పం. నేరుగా క్లినిక్‌కు వచ్చేవారికి వైద్యం అందిస్తూనే హెల్త్ క్యాంప్స్ ద్వారా స్లమ్స్‌లో వైద్య చికిత్స అందించడం అనాహత్ లక్ష్యం. ఇప్పటికి 3 లక్షల మందికి హెల్త్ క్యాంప్స్ ద్వారా వైద్యం అందించారు ప్రియ తన తల్లి రాణీదేశాయ్ చేయూతతో.

బీపీ, షుగర్ బాధితులు

'నగరాల్లో పని చేసే దిగువ ఆదాయ వర్గాల వారు సమయానికి భోజనం చేయరు. ఆహార అలవాట్లు, నిద్రలో క్రమశిక్షణ ఉండదు. శరీరాన్ని పట్టించుకోరు. దానివల్ల బీపీ బారిన పడుతున్నారు. షుగర్ వచ్చిన వారికి షుగర్ వచ్చిన సంగతి కూడా తెలియడం లేదు. మా క్లినిక్‌కు రోజుకు వంద మంది వస్తారు. ఎక్కువ మందికి ఇవే సమస్యలు. మా కౌన్సిలింగ్స్ వల్ల ఎక్కడ ఏ పనిలో ఉన్నా రాత్రి ఎనిమిదికి భోజనం చేయడం నేర్చుకున్నారు చాలామంది' అంటారు ప్రియా దేశాయ్. మిత్రుల దాతల సహాయంతో ఈ క్లినిక్‌ను నడుపుతున్న ప్రియ తగిన సహాయం దొరికితే సేవను విస్తరించవచ్చు అని తపన పడుతుంటారు.

70 రకాల పరీక్షలు

అనాహత్ క్లినిక్‌లో 70 రకాల టెస్ట్‌లు ఉచితంగా చేస్తారు. 100 రకాల మందులు ఉచితంగా ఇస్తారు. వైద్యుల పరీక్ష ఉంటుంది. వీరే కాకుండా ఫిజియోథెరపిస్ట్‌లూ సేవలు అందిస్తారు. 'ఆనంద' అనే కార్యక్రమం ద్వారా సైకియాట్రీ కౌన్సెలింగ్ కూడా ఉంటుంది. 'అన్నింటికంటే ముఖ్యం మేము పేషెంట్స్‌ను ఒక కమ్యూనిటీగా మారుస్తాం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని ఒక గ్రూప్‌గా చేసి వారే ఒకరితో మరొకరు మాట్లాడుకుని తామంతా ఈ వ్యాధులను ఎదిరించవచ్చు అనే ధైర్యం పొందేలా చేస్తాం' అన్నారు ప్రియ. చికిత్స అందించడం ఎంత ముఖ్యమో వ్యాధి పట్ల అవగాహన, నివారణ అంతే ముఖ్యమని భావిస్తారు ఈ క్లినిక్‌లో. అందుకే బెంగళూరు పేదలు అనాహత్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. ప్రియను, ఆమె తల్లి రాణి దేశాయ్‌ను అభిమానిస్తున్నారు.

'స్లమ్స్‌లో ఉన్నవారు క్లినిక్స్‌కు రారు. స్లమ్స్‌లో హెల్త్ క్యాంప్స్ విస్తృతంగా... క్రమబద్ధంగా జరగాలి. అప్పుడే దీర్ఘకాలిక వ్యాధులు బయటపడి చికిత్స మొదలవుతుంది. లేకుంటే అనవసర మరణాలు కొనసాగుతూనే ఉంటాయి. అందుకే అందరూ ఈ విషయమై ముందుకు రావాలి' అని కోరుతున్నారు ప్రియ.

నైపుణ్యమే పెట్టుబడి

సెరామిక్ అండ్ గ్లాస్ డిజైనింగ్ కష్టమైనదిగా భావిస్తూ మహిళలు ఈ కళను ఎంచుకోవడానికి వెనుకంజ వేస్తుంటారు.
అలాంటి ఈ కళను ఎంతో ఇష్టంగా ఎంచుకొని, అందులో రాణిస్తోంది తిరువనంతపుర వాసి రోసా శ్రుతి అబ్రహాం.
సాధారణంగా పెద్ద పెద్ద కర్మాగారాల నుంచి భారీగా ఉత్పత్తి అయ్యే సిరామిక్ వస్తువుల గురించి మనకు తెలిసిందే.
అత్యంత వేగవంతమైన ప్రపంచంలో ప్రాచీన కళారూపాల వెనక దాగి ఉన్న నైపుణ్యాన్ని ఈ తరానికి పరిచయం చేస్తోంది రోసా శ్రుతి.



రోసా శ్రుతి అబ్రహాం

"మురికి పట్టిన ఏప్రాన్, మట్టితో నిండిన చేతులు, చిక్కుబడిపోయినట్టు చిందరవందరగా ఉండే జుట్టు.. రోజులో ఎక్కువ పనిగంటలు ఇలాగే కనిపిస్తాను. అయితే, కొంతకాలంగా వరసగా ఆర్డర్లు పొందుతున్నాను. అందుకే రోజులో ఎక్కువ గంటలు స్టూడియోలోనే ఉండిపోతున్నాను.





అందుకు ఎంతో ఆనందంగా ఉన్నాను. నేను ఓ స్టూడియో ఓనర్ అనేకంటే నా స్టూడియోలో నిరంతరం పనిచేసే ఒక శ్రామికురాలిని అని చెప్పుకోవడానికే ఇష్టపడతాను. స్టూడియో అంటే పెద్దదేమీ కాదు ఒక గది. అయితే, బయట పచ్చదనం ఉంటుంది. నాదైన ఈ ప్రపంచంలో అందమైన సిరామిక్స్, గ్లాస్ డిజైన్స్ రూపొందిస్తుంటాను.

మాస్టర్స్ పూర్తి చేసిన తర్వాత ఏడేళ్లుగా ఈ తయారీని చేపడుతూనే ఉన్నాను. నిజానికి ఇది ప్రతిరోజూ ఒక కొత్త పాఠమే. నా స్టూడియోలో గడిపే ప్రతి క్షణం ఎంతో విలువైనది.

యజ్ఞంలా .. కళారూపాలు

సిరామిక్స్ అండ్ గ్లాస్ డిజైనింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశాక కొన్ని కంపెనీలలో వర్క్ చేశాను. ఏడేళ్లపాటు వివిధ కంపెనీలలో చేసిన ఉద్యోగాలు నాకు అంతగా సంతృప్తినివ్వలేదు. దీంతో ఉద్యోగంలో సంపాదించిన కొద్ది మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి ఇంటి దగ్గరే 'కొసావో' పేరుతో ఓ స్టూడియోను ఏర్పాటు చేశాను. ఇప్పుడు





ఇదే నాకు జీవనాధారం అయ్యింది. కళాకారిణి నుంచి వ్యవస్థాపకురాలిగా ఎదగడం, నేర్చుకోవడం ... నా ప్రయాణం ఇలాగే కొనసాగించాలనుకుంటున్నాను. ఐదేళ్లుగా ఈ పని ఓ యజ్ఞంలా కొనసాగుతూనే ఉంది. కళారూపాల సృష్టిలోనే కాదు ఇతరులకు బోధించడంలోనూ ఆనందాన్ని, ఆదాయాన్నీ పొందుతున్నాను. అందుకే నా స్టూడియోలో ప్రతిరోజూ అన్ని సీజన్లలోనూ క్లాసులు ఉంటూనే ఉంటాయి. 'ఐదేళ్ల కిందటి వరకు మీరెక్కడ ఉంటారో మాకు తెలియదు, ఇప్పుడు ఎవరిని అడిగినా ఇట్టే చెప్పేస్తారు' అని క్లాసులకు వచ్చినవారు అంటుంటే చిరునవ్వే నా సమాధానంగా ఉంటుంది.

దేనికదే ప్రత్యేకం..

బయట మనకు ఎన్నో రకాల మిషన్ మేడ్ కళారూపాలు లభించవచ్చు. కానీ, వాటిలో ఒక ఆత్మ అంటూ ఉండదు. ఈ కళను ఏ డిజిటల్ పరికరాలతోనూ భర్తీ చేయలేం. వీటి తయారీలో ఓర్పు, పట్టుదల అవసరం. అందుకు మంచి ప్రతిఫలం కూడా లభిస్తుంది. ఉద్యోగంలో మరొకరి కోసం పనిచేస్తున్నప్పుడు మనకు పరిమితులు ఉంటాయి. సొంతంగా ఏదైనా ప్రారంభించాలంటే అందులో నైపుణ్యం అవసరం. వివిధచోట్ల పనిచేసిన అనుభవం కూడా నాకు చాలా సహాయపడింది. అలాగే, విభిన్న వ్యక్తుల నుంచి వారి ప్రవర్తనల నుండి రకరకాల పద్ధతులు, మార్గాలను అర్థం చేసుకోగలిగాను. ఇవన్నీ నన్ను నేను కొత్తగా మలుచుకోవడానికి సహాయపడ్డాయి.



వస్తువుల తయారీని ఫొటోలుగా తీసి, వాటిని ఆన్‌లైన్ ద్వారా కస్టమర్లకు షేర్ చేస్తుంటాను. ఆ తర్వాత రకరకాల పద్ధతుల్లో అనుకున్న రూపానికి తీసుకువస్తాను. ముఖ్యంగా పాత సినిమాలు, డైలాగ్‌ల నుండి ప్రేరణ పొందిన థీమ్‌లతోనూ వస్తువుల తయారీకి ప్లాన్ చేస్తుంటాను. ఇవి చాలామందిని ఆకట్టుకుంటున్నాయి. సిరామిక్ అండ్ గ్లాస్ డిజైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను' అని వివరిస్తుంది రోసా శ్రుతి.



విజయపథం

'మోనా'ర్క్

* ఆత్మవిశ్వాసమే రాజసం
* సాధారణ స్థాయి నుంచి బిలియనీర్ వరకు

వరల్డ్స్ మోస్ట్ ప్రిస్టీజియస్, గ్లామరస్ ఫ్యాషన్ ఈవెంట్ 'మెట్ గాలా–2024'లో బ్రేక్‌ఔట్ స్టార్‌గా అందరి దృష్టిని ఆకర్షించింది మోనా పటేల్. 'ఎవరీ మోనా?' అని సెర్చ్ చేసేలా చేసింది. వడోదర నుంచి అమెరికా వరకు ఫ్యాషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మోనా ఎదిగిన వైనం స్ఫూర్తిదాయకం. ఫిలాంత్రపిస్ట్‌గా ఎన్నో రకాల సేవాకార్యక్రమాలు చేపడుతోంది...



మోడల్‌గా మోనా పటేల్

గుజరాత్‌లోని వడోదరలో పుట్టి పెరిగిన మోనా పటేల్ చాలామంది అమ్మాయిలలాగే స్కూల్, కాలేజీ రోజుల్లో రకరకాల వివక్షలు, సవాళ్లు ఎదుర్కొంది. 'ఆటలు మగవారి కోసమే','ఆడవారు ఇంట్లోనే క్షేమంగా ఉంటారు' 'లక్ష్యాలు అనేవి మగవారి కోసమే' ఇలాంటి ఎన్నో పురుషాధిక్య భావజాల ధోరణులకు సంబంధించిన మాటలు విన్నది మోనా.

అయితే అలాంటి మాటలకు ఎప్పుడూ విలువ ఇవ్వలేదు.

సవాలుకు సై అనడం తప్ప వెనక్కి తిరిగి చూసింది లేదు.

పన్నెండు సంవత్సరాల వయసు నుంచి బాయ్స్-స్టైల్ హెయిర్ కట్‌తో కనిపించడం ప్రారంభించింది. వస్త్రధారణ కూడా అచ్చం అబ్బాయిలలాగే ఉండేది.

'ఏమిటీ వేషం'లాంటి వెక్కిరింపులకు ముఖం మీదే సమాధానం చెప్పి నోరు మూయించేది.

'హెయిర్ కట్ అనేది రెబిలియన్ యాక్ట్. సెల్ఫ్-ఎంపవర్‌మెంట్‌కు సింబల్' అంటూ ఆనాటి రోజులను గుర్తు చేసుకుంటుంది మోనా.

ఇంటి నుంచి బయటి వెళ్లడమే సాహసంగా భావించే రోజుల నుంచి చదువు కోసం గుజరాత్ యూనివర్శిటీలో అడుగు పెట్టింది. హోమ్ టౌన్ తప్ప మరో టౌన్ తెలియని మోనా పైచదువుల కోసం న్యూజెర్సీలోని రాత్‌గర్స్ యూనివర్శిటీకి వెళ్లింది.

'ఔట్‌సైడ్ ఇండియా లైఫ్ గురించి ఎప్పటి నుంచో ఆసక్తి ఉండేది. చదువుల రూపంలో అది నెరవేరింది. ఒంటరిగా బయలుదేరినప్పటికీ ఆ ఒంటరితనమే ధైర్యాన్ని ఇచ్చింది. కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది' అంటుంది మోనా.

అమెరికాకు వెళ్లిన కొత్తలో అక్కడి వేషధారణ, ఆచార వ్యవహారాలు తనకు కొత్తగా అనిపించేవి.

'ఈ ప్రపంచంలో నేను ఇమడగలనా!' అని కూడా సందేహించేది.

అయితే ఆ ప్రపంచంలోనే ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయధ్వజం ఎగరేసింది మోనా పటేల్.

ఒక్కో మెట్టు ఎక్కుతూ హెల్త్‌కేర్, టెక్, రియల్ ఎస్టేట్... మొదలైన రంగాలలో ఎనిమిది కంపెనీలను నెలకొల్పింది.

వ్యాపార విజయాలే కాదు సామాజిక సేవాకార్యక్రమాలు కూడా మోనాకు ఇష్టం. జెండర్ ఈక్వాలిటీ, అమ్మాయిల చదువు, ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను దృష్టిలో పెట్టుకొని 'కొచర్ ఫర్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది.

'మూడు పెద్ద సూట్‌కేస్‌లతో తొలిసారిగా ఇండియా నుంచి డల్లాస్‌కు బయలుదేరాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మోనా.

ఆ సూటుకేసులలో విలువైన వస్తువులు ఉండచ్చు. అయితే వాటి అన్నిటికంటే అత్యంత విలువైనది... ఆమెలోని ఆత్మవిశ్వాసం. ఆ ఆత్మవిశ్వాసమే మోనా పటేల్‌ను తిరుగులేని ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది. ఎంతోమందికి స్ఫూర్తి ఇచ్చేలా చేస్తోంది.


బంగారు రెక్కల సీతాకోకచిలుక

ప్రతిష్ఠాత్మకమైన మెట్‌గాలా 2024 ఎడిషన్‌ను న్యూయార్క్‌లోని 'మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్'లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెన్నిఫర్ లోపెజ్, సారా జెస్సికా, ఆలియా భట్, ఇషా అంబానీ, నటాషా పూనావాలా... మొదలైన ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్నారు. మెట్ గాలా రెడ్ కార్పెట్‌పై కనిపించాలనేది ఎంతోమంది అమ్మాయిల కల. అయితే తొలి ప్రయత్నంలోనే ప్రేక్షకులు 'వావ్' అనుకునేలా చేసి, మెట్ గాలాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పటేల్. 'ది గార్డెన్ ఆఫ్ టైమ్' థీమ్‌తో రూపొందించిన సీతాకోకచిలక ఆకారంలో ఉన్న గౌనుకు ఎంతోమంది ఫిదా అయ్యారు. 'నా వారసత్వాన్ని సెలబ్రేట్ చేసుకునేలా నా డెబ్యూ లుక్ ఉండాలనుకున్నాను' అంటుంది పటేల్. రెడ్ కార్పెట్‌పై పటేల్ బ్యూటీ లుక్ సోషల్ మీడియాలో వైరల్ సెన్సేషన్‌గా మారింది.

బ్యూటిప్స్

కనురెప్పల సోయగం...

- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్‌తో కళ్లను మీనాల్లా మెరిపించవచ్చని తెలిసినాకూడా వాటిని ఎలా అమర్చుకోవాలో అర్థం కాక ఇబ్బంది పడుతుంటే... ఒకసారి ఇలా ట్రై చేయండి.
- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్ (సౌందర్య సాధనాల మార్కెట్‌లో దొరుకుతాయి) ఒక సెట్, వాటిని అమర్చడానికి ఐలాష్ గ్లూ తీసుకోవాలి. వీటితోపాటు కత్తెర, ట్వీజర్, ఐ లాష్ కర్లర్, ఐ లైనర్, మస్కారా తీసుకోవాలి.
- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్ మరీ పొడవుగా ఉన్నట్లనిపిస్తే తగినంత మేర ట్రిమ్ చేయాలి.
- ట్వీజర్ సహాయంతో లాషెస్‌కు గ్లూ పట్టించాలి. ఇప్పుడు వాటిని జాగ్రత్తగా కనురెప్ప మీద అమర్చాలి. గ్లూ ఆరి లాషెస్ సెట్ అయ్యే వరకు ఆగాలి. స్కిన్‌కు అంటుకోకుండా గ్లూవిడిగా ఆరిపోతున్నట్లు అనిపించినా, ఆరాక ఊడి వచ్చేటట్లు అనిపించినా కనురెప్పల మీద ఆర్టిఫీషియల్ లాషెస్ కరెక్ట్‌గా సెట్ అయ్యేటట్లు మెల్లగా నొక్కాలి.



- గ్లూ ఆరిన తర్వాత లాషెస్‌కు డార్క్‌షేడ్ ఐ లైనర్ అప్లయ్ చేయాలి. ఇలా చేయడం వల్ల అసలు కనురెప్పలకు, ఆర్టిఫీషియల్ లాషెస్‌కు మధ్య తేడా కనిపించకుండా అంతా ఒకేలా ఉంటాయి.
- చివరగా ఐలాష్ కర్లర్‌తో వంపు తిప్పాలి. అవసరమనిపిస్తే (మరింతడార్క్‌గా కనిపించాలనుకుంటే) మస్కారా అప్లయ్ చేయాలి.

కోమలమైన పెదవుల కోసం...

- రోజూ ఉదయాన్నే బ్రష్ చేసిన తరువాత.. బ్రష్ మీద కొద్దిగా తేనె వేసి రెండు పెదవులపైన గుండ్రంగా ఐదు నిమిషాలపాటు రుద్దాలి. ఇలా రోజూ చేయడం వల్ల పెదవులపై పేరుకుపోయిన మృతకణాలు తొలగిపోతాయి. మర్దన వల్ల రక్తప్రసరణ సక్రమంగా జరిగి పెదవులు మృదువుగా మారతాయి.
- ఉదయం బ్రష్‌తో మర్దన చేసాక, రాత్రి పడుకునేముందు మాయిశ్చరైజర్ తప్పనిసరిగా రాయాలి. ఇందుకోసం.. కొద్దిగా బీట్‌రూట్ రసాన్ని వేడి చేయాలి. వేడిచేసిన రసంలో అర టీస్పూను కార్న్‌ఫ్లోర్ వేసి ఐదు నిమిషాలపాటు బాగా కలిపి దించేయాలి. తరువాత ఈ మిశ్రమంలో అర టీస్పూను గ్లిజరిన్, పావు టీస్పూను కొబ్బరి నూనె కలిపి ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వచేయాలి. ఈ మిశ్రమం గట్టిపడిన తరువాత పెదవులకు రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయం నీటితో కడిగేయాలి



- ఈ రెండింటిని ఒకదాని తరువాత ఒకటి క్రమం తప్పకుండా పాటిస్తే పెదవులు గులాబి రేకుల్లా కోమలంగా పింక్ కలర్‌లో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.